వానకారు కోయిల

కాలచక్రం తిరుగుతూనే ఉంది.

వసంతం వెంట గ్రీష్మం, వర్షాకాలం వస్తూనే ఉంటాయి.

వర్షాకాలం మాత్రం ఎంతకాలం నిలుస్తుంది..? తన పని పూర్తికాగానే తన దారిన తాను వెళ్లిపోతుంది.

తామరాకు మీది నీటిబొట్టులా ఇవేమీ పట్టించుకోని మనిషి మనసు మాత్రం ఆశల పల్లకీలో పయనిస్తూ ఉంటుంది.

ఆ వెన్నెల మనసు– 'తిరిగి వసంతం ఎప్పుడు వస్తుందా..?' అని ఎదురుచూస్తోంది.

వసంతం వస్తే కాని సమీర్ రాడు. సమీర్ వస్తే కాని, తన జీవితానికి వసంతం రాదు.

ఫాల్గుణం కదిలి చైత్రం సమీపిస్తోంది.

దూరంగా కోయిల గొంతు సవరిస్తున్న అస్పష్టనాదాలు వినబడుతున్నాయి. గాలి చప్పుళ్ళకే ఉలిక్కిపడే 'వెన్నెల' లేతమనసులో కవోష్ణపు రాగాల జల్లులు :

"పోస్టు..!" అన్న కేక వినబడగానే వెన్నెల ఒక్క పరుగున వీధుల్లోకి వచ్చింది.

పోస్టుమాన్ అందించిన కవరు కంగారులో అడ్డదిడ్డంగా చింపి చదివింది.

"అమ్మా! పక్కవాళ్ళు మళ్లీ వచ్చేస్తున్నారు!" అంటూనే తిరిగి లోపలికి తల్లి దగ్గర వాలింది.

"ఎప్పుడు వస్తున్నారమ్మా?"

"ఎల్లుండి పొద్దుట!" తల్లికి సమాధానమిచ్చింది వెన్నెల.

"ఎల్లుండేనా? ఎన్ని పనులున్నాయి? ముందు ఇల్లు కడిగి శుభ్రం చేయించాలి!" ఆవిడ ఇంకా ఏదో చెబుతూనే ఉంది.

'వెన్నెల' అక్కడ నుంచి కదిలి తన గదిలో మంచం మీద వాలిపోయింది.

వెన్నెల కళ్ళ నిండా కొత్త వెలుగు..!

ఆ వెలుగులో గతం కథ రీలులా తిరిగింది.

... ఆ కథలో అంతటా సమీరే!

పెరటి చెట్టు మీద కూర్చున్న వసంత కోయిల "కూ..! కూ..!" అంటూ కూస్తోంది. పిల్లలు తిరిగి, "కూ! కూ!" అంటున్నారు. వారితో గొంతు కలిపింది వెన్నెల.

మరింత పంతంతో కూస్తోంది కోయిల.

అంతలో పక్కింటిముందు కారు ఆగిన శబ్దం! పిల్లలందరూ వీధి అరుగుల మీద చేరి కారు వైపు ఆశ్చర్యంగా చూశారు.

వారి మధ్యలో నిలబడిన వెన్నెల– తల్లి వెంట కారు దిగుతున్న సమీర్‌ను చూసి ఆశ్చర్యపోయింది. ఫుల్‌సూటులో ఉన్న అతనిలో ఏదో వింత అందం..!

'అమెరికాలో చదువుకుని వస్తే– ఇలా ఉంటారు కాబోలు, అబ్బో..!' అనుకుంది.

పిల్లలు వెక్కిరించడం ఆపగానే కోయిల తిరిగి పాట అందుకుంది.

తలుపులు తీసుకుని లోపలకి అడుగు వేసిన సమీర్– ఆ కోయిలను వింతగా చూశాడు. చిన్నతనంలో ఆ ఊళ్ళోనే కోయిలను చూసిన జ్ఞాపకం!

"పక్షి చిన్నదేకాని, ఎంత అందమైన పాటో... వింతగా ఉంది కదమ్మా!"

"పిట్టకొంచెం... కూత ఘనం అంటారు ఇందుకే!" కొడుక్కి సమాధానమిచ్చిందా తల్లి.

"ఉగాది పచ్చడితోపాటు కాఫీ కూడా ఇచ్చి వచ్చా కదా! ఈ పూట భోజనాలకి మనింటికే వస్తున్నారు!" తల్లి మాటలకి–

"అలాగా..!" అంది వెన్నెల.

"అవునమ్మా! మేమే ఒండుకుంటాం... అంటూ ఒకటే పట్టు! వాళ్ళని వప్పించేటప్పటికి నా తలప్రాణం తోక్కి వచ్చిందనుకో!"

"నిజంగా నీ ప్రాణం అప్పుడే తోకకి వచ్చేసిందామ్మా!" తల్లి మాటలు మళ్ళీ అడుగుతూ పకపకా నవ్వింది వెన్నెల.

"సరేలే... నీతో కూర్చుంటే నా పని అయినట్లే!" ఆవిడ వంటింటి వైపు నడిచింది.

"వీళ్ళు కూడా ఈరోజు ఉగాది పచ్చడి తింటారా?"

"అలా అంటావేమిటి సమీర్! ఈ సాంప్రదాయాలన్నింటికీ పుట్టిళ్ళు ఈ పల్లెటూళ్లే! అమెరికాలో అన్ని సరకులు దొరకవు కాని, లేకపోతే అమెరికాలో కూడా ఈ ఉగాది పచ్చడి ఉగాగి పండక్కి స్పెషలే అవుతుంది! అయినా... అమెరికాలో కూడా మన ఇడ్లీ, వడ, దోసె, గోంగూర పచ్చళ్ళతో పాటు ఇదీ స్పెషల్ అవుతుంది... చూస్తూండు!"

"నిజమే... నాలాటి వాళ్ళకి అక్కడికి కూడా వీటిని పట్టుకువెడితే కాని తోచదు కదా! ఆ పని మాత్రం చెయ్యకు" అంటూ తల్లికో నమస్కారం పెట్టాడు సమీర్.

తల్లితో పాటు సమీర్ కూడా నవ్వుకున్నాడు.

'దీంట్లో షడ్రుచులు ఉంటాయి! మన భావాలను వెల్లడిస్తాయి. అదే దీని స్పెషల్..! ముందు దీన్ని నోట్లో వేసుకుంటే తప్ప కాఫీ ఇవ్వను తెలిసిందా!"

చెయ్యి చాచి చంటి పిల్లాడిలా మారాం చేస్తూ పచ్చడి తిన్నాడు సమీర్.

ఆ సాయంకాలం పాలేరు వెంకన్న తోడు రాగా మామిడి తోట వైపు వెళ్లాడు సమీర్.

అంతలో... దిక్కులు పులకించేలా ఒక మధుర గానం చల్లని సమీర తరంగంతో పాటు వచ్చి వారి చెవులకు తాకింది.

మామిడి తోటకు ఎదురుగా ఉన్న పూలతోటలో నుంచి ఆ గానం వస్తోంది.

"ధీర సమీరె యమునా తీరె... వసతివనే వనమాలీ!"

పాట వస్తున్న వైపు సమీర్ చురుగ్గా అడుగులు వేసాడు. అతని వెంటే వెంకన్న!

ఎదురుగా ఓ యువతి మయూరిలా నర్తిస్తూ గానం చేస్తోంది.

"ఆవిడ మనమ్మాయి వెన్నెల గారండి!" ఆశ్చర్యంగా అరిచాడు వెంకన్న.

"అంటే..?"

"మన సోమయ్యగారి అమ్మాయిగారండీ!"

ఈ మాట విని ఆశ్చర్యపోవడం సమీర్ వంతయింది.

"పొద్దుటున వచ్చా! నా కంట పడలేదేమిటి?" ఈ మాటలు అనుకోకుండా అతని పెదాలు దాటాయి.

"అమ్మాయిగారు ఇంత బాగా పాడుతారని నాకే తెలీదమ్మా!" వెంకన్న సమాధానమిచ్చే లోపల వెన్నెల మిగిలిన పిల్లలతో పరుగెత్తింది.

ఆ రాత్రి సమీర్ కళ్ళ నిండా ఆమె రూపమే!

వెన్నెల గుండెల నిండా అతని రూపమే..!

ఆ తల్లి- కొడుకు మనస్సును పసికట్టింది కానీ, తెలీనట్లే ఉంది.

ఇంకా బాగా వెలుగు రాకుండానే సమీర్‌కి మెలకువ వచ్చింది.

పెరట్లో చెట్టు మీద కాకులు 'కావు! కావు!" మంటూ 'ఇంక లేవండ్రా..!' అన్నట్లుగా సందడి చేస్తున్నాయి.

సమీర్ వీధి తలుపులు తెరుచుకుని పొలాల వైపు కదిలాడు.

వీధి చివర ఒక గుడిసె మీద ఠీవిగా నిలబడిన కోడిపుంజు గొంతెత్తి, "కొక్కొరోకో..! కో..!' అంటూ అరుస్తోంది.

"లేచాలే!" నవ్వుకుంటూ సమీర్ ముందుకు నడిచాడు.

భుజాల మీద నాగళ్ళతో కొందరు; ఆవులను, గేదెలను తోలుకుంటూ మరికొందరు; ఎడ్లను అదిలిస్తూ ఇంకొందరు రైతులు పొలాల వైపు వెళుతున్నారు.

వారి వెనకే సమీర్ నడిచాడు.

అప్పటికే ఎందరో స్త్రీ, పురుషులు పొలాల్లో పనులు చేస్తున్నారు.

'తాను కూడా అలా కష్టపడి పని చేయగలిగితే..!' అతని మనస్సులో ఏవో సరికొత్త ఆలోచనలు.

చల్లని గాలి వచ్చి అతన్ని చుట్టుముట్టింది.

సమీర్ చిన్నపిల్లాడై ఆ పచ్చని చేలగట్ల మీద కోడెదూడలా పరుగులు పెట్టాడు.., ఎగిరే పాలపిట్టలతో గంతులు వేశాడు.., రామచిలుకలతో మాటలు కలిపాడు.., రంగు రంగుల సీతాకోక చిలుకలతో కాసేపు ఆడుకున్నాడు.

అంతలో... అతను పాత జ్ఞాపకాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

ఆ పొలం గట్టు మీద సీమసింత చెట్టు పలకరించినట్లయింది... పాలేరు రామన్న!

'ముంజెలు కొట్టి ఇచ్చే తాటిచెట్టు అదే!'... సమీర్ మనస్సు పాత జ్ఞాపకాలతో కలుక్కుమంది. తెంపుకుంటే తెగనిబంధంలా అనిపించింది. ఎండ వంటిమీద పడి చురుక్కుమంది.

ఇంటివైపు వేగంగా అడుగులు వేశాడు.

"ఇది తాతగారు కూర్చునే కుర్చీ కదమ్మా! ఇది నానమ్మ చేసే ఒత్తులు బుట్ట కదమ్మా! ఈ పశువుల పాక ఖాళీగా ఉందామ్మా!"

ఒక్కొక్క వస్తువే పరిశీలనగా చూస్తూ అడుగుతున్న సమీర్‌ని ఆవిడ ఆశ్చర్యంగా చూసింది.

"తాతా నానమ్మలు ఇప్పుడు లేరు కదా! అందుకే అన్నీ ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయవలసిన బాధ్యత నీవేరా!"

... తల్లి మనస్సులోని లోతుల్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయినా- ఆ యువకుడు కొంత అర్థంచేసుకున్నాడు.

ఆ తాతా నానమ్మలకు తానొక్కడే మనవడు. ఏదో బరువు బాధ్యతలను తన భుజాల కెత్తుకున్నట్లనిపించింది. నిజంగానే బరువుగా అనిపించిన భుజాల వైపు చూసుకుని నవ్వుకున్నాడు.

ఆ సాయంకాలం వంటరిగా సమీర్ మామిడితోట వైపు వెళ్లాడు.

ఆ రసాల తలాల నిండా కాయలతో, పళ్ళతో నందనోద్యాన వనాన్ని తలపింప చేస్తున్నాయి. కోయిల పాట వినబడలేదు. తోట బావి దగ్గర ఆమె పాట వినబడలేదు.

అయినా... ఆ పూలతోట మధ్యలో ఆమెకోసం ఎదురుచూశాడు.

అంతలో... పాద మంజీరాల మనోహర ధ్వని రానురాను దగ్గరయింది. చంకన బిందెలో బావిని సమీపించింది ఆ కన్య.

అతని గుండె ఝల్లుమంది.

" నా పేరు సమీర్! మీ పేరు?" ఆమెను సమీపిస్తూ అడిగాడు.

"వెన్నెల!" చిరుగాలికి చిగురులా సమాధానమిచ్చింది.

"నిన్నటి పాట మళ్లీ ఒక్కసారి పాడుతారా? మీ పాట వినాలని వచ్చా! మీరే కలిసారు."

"ఇప్పుడు కాదు... రేపు!" ఆమె కిలకిలా నవ్వుకుంటూ ఇంటివైపు పరుగెత్తింది.

బావి పక్కన ఇత్తడి బిందె సమీర్‌లాగే వెలవెలబోయింది.

కాలాన్ని ఎవరూ ఆపలేరన్నట్లుగా చీకటి చుట్టుముట్టింది.

కళ్ళు మరో వెలుగు తోడుంటే తప్ప- మరేది కాంచలేవు. దారి వెతుక్కుంటూ ఇంటి వైపు నడిచాడు.

అతడు ఏ పని చేస్తున్నా అతని ఆలోచనలన్నీ 'వెన్నెల' వైపే!

ఓ శిల్పి చెక్కిన అపురూపశిల్పంలా సమీర్ కళ్ళ ముందు ఆమె.

కోయిల పాటతో పాటే ఆమె పాట వింటూనే ఉన్నాడు.

అతడి ఊహల చల్లదనంలో వసంతం గడిచి జ్యేష్ఠం ప్రవేశించినా ఆ ఎండల వేడి అతనికి తెలియడం లేదు.

అంతలో... ఒకరోజు వడగాల్పుల మిట్ట మధ్యాహ్నపు వేళ ఊరి చివర గుడిసె లంటుకున్నాయి. నల్లని పొగలు భయంకరంగా ఊరును చుట్టుముట్టాయి.

అందరూ మంటలు ఆర్పడానికి పరుగులెట్టారు.

"అమ్మా! నేను వెడుతున్నా!" సమీర్ వారి వెంటే పరుగెత్తాడు.

ఎప్పుడూ అరుగు దిగని ఆ కొడుకు ఈరోజు అందరితో కలిసి అలా పరుగెడుతుంటే ఆ తల్లి శ్యామలాదేవికి ఆశ్చర్యంగా అనిపించింది. పరిసరాల ప్రభావం మనిషి మీద ఎంతగా ఉంటుందో అర్థంచేసుకుంది.

అంతలో... ఆషాఢ మాసపు మబ్బులు ఆకాశాన్ని చుట్టుముట్టాయి.

ప్రకృతిలో ఏదో గందరగోళం! పుడమితల్లికి ఏవో పులకింతలు..!!

ఆరోజు చినుకులు పడి ఆగిపోయాయి. సమీర్ తోటవైపు బయలుదేరాడు.

మామిడి చెట్ల మధ్యలో నిలబడి పాడుతోంది. యమునా తటిలో వేణువులా పరిసరాలను పులకింప చేస్తోంది ఆమె గానం! తనను చూస్తే ఎక్కడ పాట ఆపివేస్తుందోనని సమీర్ మెల్లిగా అడుగులు వేస్తూ చెట్టుచాటున నిలబడ్డాడు. కొంచెం తడిసిన ఎండుటాకుల మీద మనిషి పాదాల చప్పుడు ఇట్టే పసికట్టింది.

"హలో... వెన్నెలగారూ! మీరు నాకు పాట బాకీ ఉన్నారు. బాకీ తీరేవరకు కదలను!" అన్నాడు సమీర్ నవ్వుతూ.

"పాడుమంటే పాట రాదు. నేను పాడినప్పుడే మీరు వినాలి!" ఆమె కిలకిలా నవ్వుతుంటే ఆమె మనసు అద్దంలా ప్రతిబింబించింది.

వారి పరిచయం మరింత గాఢమయింది.

ఇద్దరూ రాజహంసల జంటల్లా ఆ తోటలో పరుగులు పెట్టారు.

పువ్వులతో ఆడుకున్నారు.., పిట్టలతో ఎగిరి గంతులేశారు.

సమీర్ వెళ్లవలసిన రోజులు దగ్గర పడుతున్నాయి.

వెన్నెల ఆకాశాన్ని ఆవరించాయి. ఉరుములతో మెరుపులతో వానలు ప్రారంభమయ్యాయి.

"అమ్మా! కోయిల పాట వినపడదేం?!" సమీర్ అమాయకంగా అడిగాడు.

"వేసవిలో మామిడి చిగుళ్ళు తిని పదును పెట్టుకున్న కంఠంతో పాడే కోయిల కంఠం మూగ బోయింది. అందుకే పాట లేని కోయిలను 'వాన కారు కోయిల' అంటారు బాబూ!" తల్లి మాటలు సమీర్‌కి ఆశ్చర్యంగా అనిపించాయి.

ఆ సాయంసంధ్యలో సమీర్ తోటలో వెన్నెలను కలిశాడు.

"వెన్నెలా! నాకు బాకీ ఉన్నా పాట పాడవా?" ప్రేమగా అడిగాడు సమీర్.

ఆ మాటల్లో జాలి ఉంది, అభ్యర్థన వుంది.

వెన్నెల సమాధానం చెప్పలేదు.

"నేను వెళ్లిపోతున్నానని బాధపడుతున్నావా? వాన కారు కోయిల్లా నీ గొంతు మూగబోయిందా?"

"అవును సమీర్... వసంతం లేనిదే కోయిల పాట లేదు. కోయిల పాట లేనిదే వసంత శోభ లేదు!"

వెన్నెల మనస్సులో సుళ్ళు తిరుగుతున్నది ప్రేమా? ప్రణయమేనని ఆ కన్యకు తెలియదు.

సమీర్ సమీపంలో ఉండాలి! అంతే!

"వెన్నెలా! శిశిరం తరువాత వసంతం రాక మానదు. ఈ వర్షాకాలం తరువాత శరదృతువు రాక మానదు. వసంతంలో మళ్లీ కలుసుకుందాం!" సమీర్ బయలుదేరాడు.

అతను తిరిగి ఆ పరిసరాలకు రాగలుగుతాడో, లేదో అతనికే తెలియదు.

వెన్నెలను కలుసుకుంటాడో లేదో అంతకంటే తెలీదు. ఇంకా ఏదీ జీవితంలో నిర్ణయించుకోలేదు.

సుప్రభాత వేళలో సమీర్ తల్లితో ప్రయాణమయ్యాడు. ఎదురుగా తల్లి అక్క, చెల్లి, తమ్ముళ్ళ మధ్యలో వెన్నెల. సమీర్ అందరికీ "టా! టా!" అంటూ చేయి ఊపాడు.

కారు ముందుకు కదిలింది. సన్నని జడివానలో వెన్నెల కన్నీళ్లు ఎవరికీ కనబడలేదు. సమీర్ తల పక్కకు తిప్పాడు. తల్లి చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.

వెన్నెల ఎదురుచూస్తూనే ఉంది. వసంతం సమీపిస్తోంది.

శుభవార్తను మోసుకుంటూ వచ్చిన ఉత్తరాన్ని పోస్టుమాన్ అందించాడు.

ఆశించిన శుభవేళలో కారు ఆ ఇంటి ముందు ఆగింది. వెన్నెల ఊపిరి బిగపట్టి చూస్తోంది. సమీర్ కారు దిగాడు.

వెనకే తల్లి దిగింది.

ఎంతో మంది గ్రామవాసులు స్వాగతం పలికారు. ఆ గ్రామంలోనే ఫ్యాక్టరీ పెట్టి సమీర్ ఉండిపోతాడన్న వార్త ఊరంతా పరిమళంలా వ్యాపించింది.

అందుకే స్వాగతం చెప్పడానికి ఊరంతా కదిలివచ్చింది.

ఆ దృశ్యాన్ని చూస్తూ ఆనందం పట్టలేక ఆ మూగబోయిన 'వానకారు కోయిల' అలాగే నిలబడిపోయింది.

సమీర్ చూపులు ఆమెను చుట్టుముట్టాయి.

సమీర్ తల్లి సంతోషానికి అంతులేదు.

"అమ్మా! ఇంక నేను అమెరికా వెళ్లను. మన భూములు చూసుకుంటూ ఎరువులు ఫ్యాక్టరీ ప్రారంభిస్తానమ్మా!"

అంతక్రితం ఎంత చెప్పినా వినని కొడుకు– ఇప్పుడు ఆ పల్లె వెళ్లి వచ్చిన తరువాత అక్కడే స్థిరపడతానంటే దానికి 'వెన్నెలే' కారణమని ఆవిడ ఇట్టే అర్థంచేసుకుంది.

చిక్కి సగమయిన వెన్నెలను ఆప్యాయంగా చూసుకుంది.

"కోయిలవై పాడాలి! వసంతం వచ్చేసిందమ్మా!" వెన్నెలను దీవించింది మనసులోనే.